మాకిదేనా గౌరవం?

- సర్పంచ్‌లు, ఎంపీటీసీల ఆగ్రహం
- మేము ప్రజాప్రతినిధులం కాదా?
- పెన్షన్ల పంపిణీలో టీడీపీ నాయకుల పెత్తనమా?
- మండల సర్వసభ్య సమావేశంలో నిలదీత

సాలూరు రూరల్:

అభివృద్ధి పనుల తీర్మానాల్లో సర్పంచ్‌లు ఎంపీటీసీలతో పనిలేదా? అసెంబ్లీకి వెళ్లిన ఎమ్మెల్యేలు మాత్రమే ప్రజాప్రతినిధులా? మేము కాదా? అంటూ అధికారుల తీరుపై వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్‌తో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక మండల కార్యాలయంలో ఎంపీపీ గరుగుబిల్లి రాములమ్మ అధ్యక్షతన సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ గొల్లపల్లి పార్వతి శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ క్రమంలో తొలుత విద్యాశాఖ తరఫున ఎంఈఓ వివరాలను తెలియజేసే క్రమంలో శివరాంపురం ఎంపీటీసీ క్లోపల్లి త్రినాథ మాట్లాడుతూ పెదబోరబంద పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులకు బదులు ఇద్దరినే కొనసాగిస్తున్నారెందుకు? అని ప్రశ్నించగా రాష్ట్రమంతటా వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌లో భాగంగా తగ్గించామని త్వరలోనే అవసరమైన చోట ఉపాధ్యాయులను నియమిస్తామని తెలియజేశారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో పెదపదంలో వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం రాజన్నదొర మంజూరు చేసిన హెల్త్ సెంటర్ నిర్మాణానికి పనులు జరుగుతున్నాయి కానీ స్థానిక సర్పంచ్‌కు కనీసం తెలియపరచడం లేదు ఎందుకని వైస్‌ఎంపీపీ రెడ్డి సురేష్ ప్రశ్నించారు. దీనిపై వైస్ ఎంపీపీతో పాటు శివరాంపురం సర్పంచ్ మోహన్, పారన్నవలస సర్పంచ్‌లు అధికారుల తీరుపై మండిపడ్డారు. కనీసం సర్పంచ్‌లు ఉన్నారనుకుంటున్నారా? అసలు అవసరంలేదనుకుంటున్నారా? అధికారులు తీరు మార్చుకోకపోతే పద్ధతిగా ఉండదని ధ్వజమెత్తారు.

సర్పంచ్ ప్రమేయం లేకుండా తీర్మానాలు?

పెన్షన్ల పంపిణీలో కూడా ఇదే తీరు కనపరుస్తున్నారని అసహనం వెళ్లగక్కారు. గ్రామాల్లో ఇంటింటికీ అందజేయాల్సిన పెన్షన్లు రామ మందిరాలపై ఇస్తున్నారని అది కూడా స్థానిక సర్పంచ్‌లకు తెలియపరచకుండా టీడీపీ కార్యాకర్తలు పంపిణీ చేస్తున్నారన్నారు. అలాగే ఉపాధి హామీ పనుల విషయంలో కూడా కూడా సర్పంచ్‌ల ప్రమేయం లేకుండా తీర్మానాలు చేయడం విచారకరమన్నారు. ఇలా చేయమని మంత్రి ఆదేశాలు జారీ చేశారా? లేక అధికారులే ఇలా నిర్ణయాలు తీసుకుంటున్నారో? సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఏ ప్రభుత్వమైనా కొత్త పథకాన్ని ప్రజలకు అందించేటప్పుడు ప్రజాప్రతినిధులతో అందజేస్తారు అలాంటిది పెన్షన్ పథకం రూ. నాలుగు వేలు చేసి మూడునెలలవుతున్నా ఇంకా టీడీపీ కార్యకర్తలతోనే అందజేయాలని ప్రభుత్వం తీర్మానం చేసిందా? అని నిలదీశారు. అధికారులు ఇలాగే వారి తీరు కొనసాగిస్తే మా హక్కుల కోసం పోరాడాల్సి వస్తుందని హెచ్చరించారు.

రైతులకు కీడు చేయకండి

అనంతరం విద్యుత్ సమస్యలపై తోణాం సర్పంచ్ ముద్వల ఆదియ్య సారిక సర్పంచ్‌లు ఆ శాఖ ఎ.డికి తెలియజేశారు. రైతులకు ఎలాగూ రైతు భరోసా ఇవ్వడం లేదని, కనీసం రుణాలు రెన్యువల్ చేసుకోడానికి బ్యాంక్‌లకు అవసరమైన వన్‌బిలు ఎందుకు రావడం లేదని సర్పంచ్‌లు ఎంపీటీసీలు డిప్యూటీ తహసీల్దార్‌ను ప్రశ్నించారు. రైతులకు మేలు చేయకపోయినా కీడు జరగకుండా ఈ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటినుంచి పంచాయతీల్లో ఏ పనులు జరిగినా సర్పంచ్‌ల తీర్మానాలు లేకుండా మంజూరు చేయరాదని, జరిగిన అభివృద్ధి పనులకు బిల్లులు సర్పంచ్‌ల ఖాతాలో జమ అయ్యేలా సభ్యులు తీర్మానించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ సువ్వాడ గుణవతి పాల్గొన్నారు.



అధికారులను పెన్షన్ల పంపిణీ విషయంలో నిలదీస్తున్న శివరాంపురం సర్పంచ్ మోహన్ తదితరులు



ప్రజాప్రతినిధుల ప్రమేయం లేకుండా పనులు ప్రారంభంపై ప్రశ్నిస్తున్న వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్

స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్యసాధనకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ కోన శ్రీనివాస్

పార్వతీపురం టౌన్: స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్య సాధనకు కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ కోన శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందితో మంగళవారం ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రణాళిక డాక్యుమెంట్ తయారీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. స్వర్ణాంధ్ర-2047 క్యూఆర్ కోడ్‌ను ఉపయోగించి సలహాలు సూచనలు ఇవ్వాలని కోరారు. పట్టణంలోని 15 సచివాలయాల పరిధిలో వార్డు సభలు నిర్వహించాలని, సచివాలయ సెక్రటరీలు కార్యక్రమంలో పాల్గొని ప్రజలతో లాగిన్ చేయించి వారి అభిప్రాయాలు సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిరోజూ తాగునీరు అందించేందుకు చర్యలు

పట్టణంలో ప్రతిరోజూ తాగునీటిని అందించేందుకు చర్యలు చేపట్టామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన బూస్టర్ పంప్ హౌస్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడిచిన మూడు నెలలుగా చేపట్టిన చర్యల వల్ల కొత్తగా 3 బోరులు, 2 రీచార్జ్ వెల్స్ నిర్మించామన్నారు. ఫలితంగా గంటకు 6 లక్షల లీటర్లకు అదనంగా 60 వేల లీటర్లు అందుబాటులో తీసుకు వచ్చామని తెలిపారు. కార్యక్రమంలో డీఈ కిరణ్, ఏఈ ఆనంద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

గర్భిణులకు సీమంతం



కన్నంపేటలో మాట్లాడుతున్న పీడీ ఎం.ఎస్.రాణి

మక్కువ: మండలంలోని కన్నంపేట గ్రామం అంగన్వాడీ సెంటర్‌లో పోషకాహార మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఐసీడీఎస్ పీడీ ఎం.ఎస్ రాణి అధ్యక్షతన గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం ప్రాముఖ్యత, ఆవశ్యకతపై గర్భిణులు,బాలింతలకు అవగాహన కల్పించారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.సావిత్రి, ఎంపీడీఓ సూర్యనారాయణ, సీడీపీఓ బి.అనంతలక్ష్మి, సూపర్‌వైజర్స్ పి. రాజశ్రీ, ఎన్.లీలావతి, సచివాలయ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

కేపీఎం హైస్కూల్‌లో అదనపు భవనాలు ప్రారంభం



అదనపు భవనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

పార్వతీపురం టౌన్: పట్టణంలోని కేపీఎం హైస్కూల్‌లో అదనపు భవనాలను ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఎంఎస్ నిధులు రూ.40.20 లక్షలతో భవనాలు నిర్మించామన్నారు. నియోజకవర్గంలో పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని, విద్యార్థులు విద్యపై దృష్టి కేంద్రీకరించి భవిష్యత్తులో మంచి స్థానానికి చేరుకుని పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, జిల్లా విద్యాశాఖాధికారి జి. పగడాలమ్మ, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, టీడీపీ నాయకులు, సమగ్రశిక్ష అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కూలిన చెట్టు



రాష్ట్ర రహదారిలో స్తంభించిన వాహనాలు

సీతానగరం: మండలంలోని రాష్ట్ర రహదారిలో అప్పయ్యపేట వద్ద శతాబ్దకాలం నాటి చింత చెట్టు రోడ్డుకు అడ్డంగా కూలిపోవడంతో వందలాది వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి భూమి నాని ఉన్నందున శతాబ్దకాలం నాటి చింత చెట్టు రోడ్డుపై కూలిపోయింది. దీంతో మంగళవారం ఉదయం పార్వతీపురం నుంచి బలిజిపేట, సాలూరు, రాజమండ్రి, విశాఖపట్నం వెళ్లాల్సిన బస్సులు, విశాఖపట్నం నుంచి గుణుపూర్, రాయగడ, పార్వతీపురం వైపు రావాల్సిన బస్సుల్లో ప్రయాణికులు అవస్థలు పడాల్సి వచ్చింది.అలాగే ఉద్యోగులు విధుల్లో చేరడానికి ద్విచక్రవాహనాలతో గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుని అది క్లియర్ అయ్యాక ప్రయాణం చేయాల్సి వచ్చింది. స్థానిక ఎస్సై ఎం.రాజేష్ అధ్వర్యంలో పోలీసులు సంబంధిత అధికారుల పర్యవేక్షణలో భారీవృక్షాన్ని తొలగించి వాహనాల రాకపోకలకు దారి ఇచ్చారు.

భంజ్‌దేవ్‌కు భంగపాటు

- అసంతృప్తిలో వర్గీయులు



ఆర్‌పీభంజ్‌దేవ్, మాజీ ఎమ్మెల్యే

సాలూరు: టీడీపీ కూటమి ప్రభుత్వంలో తాజాగా కేటాయించిన నామినేటెడ్ పోస్టుల అంశం సాలూరు నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే భంజ్‌దేవ్ వర్గీయుల్లో తీవ్ర అసంతృప్తి, విస్మయానికి కారణమైంది. రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల కేటాయింపులో భాగంగా, రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆర్‌పీ భంజ్‌దేవ్‌ను సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మెంబర్‌గా ప్రకటించింది. దీంతో ఆయన వర్గీయులంతా విస్మయానికి గురయ్యారు. ఈ ప్రకటన వచ్చిన వెంటనే పలువురు టీడీపీ నాయకులు భంజ్‌దేవ్ వద్దకు వెళ్లారు. ఎన్నికల వేళ సమష్టిగా పనిచేయాలని, పార్టీ ప్రకటించిన అభ్యర్థి సంధ్యారాణిని గెలిపిస్తే మీకు ఎమ్మెల్సీ తప్పకుండా ఇస్తామని చంద్రబాబునాయుడు హామీ ఇచ్చిన విషయంపై భంజ్‌దేవ్ వద్ద ప్రస్తావించారు. మీకు ఎమ్మెల్సీ పదవి వస్తుందని మేమంతా భావిస్తే, ఈ విధమైన ప్రాధాన్యం లేని నామినేటెడ్ పదవి ఇవ్వడం ఏంటని అసహనం వ్యక్తం చేశారు. ఈ పదవి ఇవ్వడం ద్వారా, ఎమ్మెల్సీ పదవి ఇస్తారన్న హామీపై అనుమానాలు కలుగుతున్నాయని వాపోయారు. అయితే ఎవరూ సంయమనం కోల్పోవద్దని, చంద్రబాబుతో తాను మాట్లాడతానని ఆయన ఇచ్చిన హామీని అమలుచేసి, మనకు న్యాయం చేస్తారని తన వర్గీయులకు భంజ్‌దేవ్ నచ్చజెప్పినట్లు సమాచారం.

పారిశుద్ధ్యంపై అవగాహన

పాలకొండ: పారిశుద్ధ్యంపై అవగాహన పెంచుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు అన్నారు. ఈ మేరకు పట్టణంలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమం మంగళవారం నిర్వహించి రామకళా మందిరం సచివాలయం పరిధిలో ఇంటింటికీ ప్రచారం చేశారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న యోగా శిక్షకుడు భాస్కరరావు

సీతానగరం: విద్యార్థుల్లో మేధాశక్తిని పెంపొందించడానికి, సంపూర్ణ ఆరోగ్యం సాధనకు యోగా విద్య దోహదపడుతుందని యోగా శిక్షకుడు, బొబ్బిలి పట్టణానికి చెందిన జామి భాస్కరరావు అన్నారు. ఈ మేరకు గెడ్డలుప్పి కృషి విద్యానికేతన్ విద్యార్థులకు మంగళవారం నోట్‌బుక్స్ పంపిణీ చేసి యోగా విద్య పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో మేధాశక్తి పెరగడానికి, చదువుపట్ల ఏకాగ్రత కలగడానికి యోగా దోహద పడుతుందని చెప్పారు. బొబ్బిలి పట్టణంలో యోగాకు ఆదరణ లభించడం అభినందనీయమన్నారు. అలాగే గ్రామాల్లో వివిధ రకాల రుగ్మతలతో కూడిన వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారు యోగా శిక్షణలో పాల్గొవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యాలయం కరస్పాండెంట్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

100 రోజుల్లోనే పథకాల అమలు

- ఎమ్మెల్యే విజయచంద్ర



నారన్నాయుడువలసలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయచంద్ర

బలిజిపేట: ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే సంక్షేమ పథకాలను ప్రతిష్టాత్మకంగా అమలు చేసిందని ఎమ్మెల్యే విజయచంద్ర తెలిపారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని నారన్నాయుడువలసలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాల అమలుపై ఆయన ప్రజలకు వివరించారు. గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని పరిశీలించారు. రైతులు మట్టి పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగించుకోవాలని అప్పుడే సమతుల పోషకాలు పంటలకు అందుతాయని ఎమ్మెల్యే విజయ చంద్ర తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ జేడీ రాబర్ట్ పాల్, ఎంపీడీఓ విజయలక్ష్మి, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా వారాల పండగలు



బుడ్డిపేటలో ఘటాలతో తిరువీధి చేస్తున్న పూనకం పట్టిన భోగీతల్లి, భక్తులు

సీతానగరం: మండలంలోని పలుగ్రామాల్లో ఇంటి దేవతలు, దేశమ్మతల్లి వారాల పండగలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ క్రమంలో పెదభోగిలి పంచాయతీ పరిధిలో ఉన్న అప్పయ్యపేట, బుడ్డిపేట, సుంకరివీధి, సీతానగరం గ్రామాల ప్రజలందరూ రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న స్థానిక ప్రజలు కులదైవంగా పూజించే భోగితల్లి, దేశమ్మతల్లి గుడుల వరకూ ఘటాలు, విన్యాసాలు, మేళతాళాలతో ఊరేగింపుగా పూజా సామగ్రితో వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. ఏటా రైతులు వరిఉబాల పనులకు ముందుగా ఖరీఫ్ సీజనంతా సుఖంగా జరిగేలా కాపాడాలని మొక్కుకున్నారు. వరి ఉబాలకు ఎటువంటి ఆటంకాలు లేకుండా సహకరించిన అమ్మవార్లకు మొక్కులు తీర్చుకునేందుకు వారాల పండుగలు నిర్వహిచడం ఆనవాయితీ అని ఉత్సవ కమిటీ సభ్యులు తెలియజేశారు. అలాగే తామరఖండి, జోగింపేట, నీలకంఠాపురం, వెంకటాపురం, రంగంపేట, అనంతరాయుడుపేట తదితర గ్రామాల్లో వారాల పండుగలు ఘనంగా జరిగాయి.

విద్యా ప్రమాణాలు పెంచాలి



ప్రాథమిక పాఠశాలను పర్యవేక్షిస్తున్న ఎంఈఓ-1 సామల

బలిజిపేట: విద్యాప్రమాణాలు పెంచి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ-1సామల సింహాచలం కోరారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని గుడివాడకాలనీ ప్రాథమిక పాఠశాలను ఆయన మంగళవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థుల వర్క్‌బుక్‌లు పరిశీలించారు. వాటిని దిద్దుబాటు చేసే విధానాన్ని వివరించారు. వర్క్‌బుక్ ప్రాధాన్యాన్ని విద్యార్థులకు వివరించారు. బోర్డుపై అక్షరాలు రాసి విద్యార్థుల చేత చదివించారు. అకడమిక్ పుస్తకాల ప్రకారం వారిలో సామర్థ్యాలు పెరిగేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని, బడితోటను అభివృద్ధి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభినందనలు



పరీక్షిత్‌రాజుకు అభినందనలు తెలిపి, సత్కరిస్తున్న ఎంపీపీ శ్యామల, జెడ్పీటీసీ లక్ష్మి తదితరులు

కొమరాడ/జియ్యమ్మవలస: వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి శత్రుచర్ల పరీక్షిత్‌రాజు ఎన్నికైన నేపథ్యంలో ఆయనకు అన్నివర్గాల నుంచి అభినందనల వెల్లువ వస్తోంది. కొమరాడ ఎంపీపీ శెట్టి శ్యామల, జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి, కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దనరావులు చినమేరంగి కోటలో ఆయనను మంగళవారం కలిసి, అభినందనలు తెలిపారు.

సరాయివలసలో 'పొలం పిలుస్తోంది'



క్షేత్రస్థాయిలో వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ శ్రీనివాసరావు

మక్కువ: మండలంలోని సరాయివలస రైతు సేవా కేంద్రంలో ఏఓ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ శ్రీనివాసరావు రైతులకు అవగాహన కల్పించారు. 2023-24 సంవత్సరంలో రైతుల పొలాల వద్ద సేకరించిన మట్టి పరీక్షల ఫలితాలను వారికి తెలియజేశారు. నేలను సారవంతం చేయడానికి తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. రైతులు కొంతమేర రసాయన ఎరువులు తగ్గించి, సేంద్రియ ఎరువులు వినియోగిస్తే నేల ఆరోగ్యం పెంపొందించుకోవచ్చన్నారు. వరి పంటను ఆశించే పొడతెగులు నివారణకు 250ఎంఎల్, ప్రోపికోనజోల్ ఒక ఎకరాకు, అగ్గితెగులు నివారణకు 120 గ్రాములు ట్రిసైక్లోజోల్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. వరి పంటను ఆశించే పీకపురుగు, ఆకుముడత నివారణకు చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో వరి పంటను పరిశీలించారు. గ్రామ పెద్దలు, రైతులు వ్యవసాయ సహాయకురాలు సీహెచ్ త్రివేణి పాల్గొన్నారు.

రాళ్లు రువ్వుకున్న రెండు వీధుల యువత

- హెచ్‌సీ, మరో నలుగురు యువకులకు గాయాలు



తలపై రక్షణ కోసం కాటా గిన్నె పెట్టుకుని, తలకు గాయమైన హెచ్‌సీ సత్యంనాయుడిని తీసుకువెళ్తున్న మరో పోలీసు

సాలూరు: సాలూరు మున్సిపాలిటీలో రక్షక భటులకే రక్షణ కరువైన పరిస్థితి నెలకొంది. పట్టణంలో సోమవారం రాత్రి జరిగిన ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని గొల్లవీధి, వడ్డివీధికి చెందిన కొందరు యువకుల మధ్య ఈ నెల 7న వినాయక చవితి నాడు విగ్రహాలను తీసుకువస్తున్న నేపథ్యంలో వారి మధ్య స్వల్ప గొడవ జరిగింది. దీంతో ఈ గొడవ పోలీస్‌స్టేషన్‌కు చేరగా ఇరు వర్గాలకు కౌన్సెలింగ్ ఇచ్చి పోలీసులు పంపించేశారు. ఇక్కడితో గొడవ సద్దుమణిగిందని అందరూ భావించారు. అయితే సోమవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో మళ్లీ వారి మధ్య వివాదం ప్రారంభమైంది. రెండు వీధులకు చెందిన కొందరు యువత ఒకరిపై ఒకరు కర్రలతో కొట్టుకుని రాళ్లు రువ్వుకున్నారు. రాత్రి 11 గంటల నుంచి వేకువజామున సుమారు 2 గంటల వరకు ఈ తగాదా జరిగిందంటే పరిస్థితి తీవ్రత అర్థం చేసుకోవచ్చు. ఆ వీధుల ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేక భయంతో పోలీసులకు ఫోన్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపుచేసే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో హెచ్‌సీ సత్యంనాయుడు తలకు తీవ్రగాయాలు కాగా, మరో నలుగురు యువకులకు గాయాలయ్యాయి. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఓ పోలీసు ఆత్మరక్షణ కోసం కాటా గిన్నెను తలపై పెట్టుకున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కాగా ఈ సంఘటనలో ఇరు వీధులకు చెందిన 40 మందిపై కేసు నమోదుచేసినట్లు పట్టణ సీఐ అప్పలనాయుడు తెలిపారు.

సేవా గుణం అలవర్చుకోవాలి



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

పార్వతీపురం టౌన్: ప్రతి విద్యార్థి సేవాగుణం అలవర్చుకోవాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జె.రామారావు అన్నారు. జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం కళాశాలలో నిర్వహించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీ జయంతి వేడుకల్లో భాగంగా ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో మంచి నడవడిక అలవాటవుతుందన్నారు. ప్రతి విద్యార్థి జాతీయ సేవా పథకంలో భాగస్వాములై తమ వంతు సమాజానికి సేవ అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓలు టి.రవికుమార్, డి.తవిటినాయుడు, ఎస్.శ్రీనివాసరావు, అధ్యాపకులు సత్యనారాయణ, లక్ష్మణరావు, రామకృష్ణ, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

బడితోటలు అభివృద్ధి చేయాలి



కూరగాయల విత్తనాల ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న ఎంఈవో సత్యనారాయణ

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): అన్ని పాఠశాలల్లో బడితోటలు అభివృద్ధి చేయాలని కురుపాం ఎంఈవో ఎస్.సత్యనారాయణ సూచించారు. కురుపాం మండల కేంద్రంలోని మండల వనరుల కేంద్రం (ఎంఆర్‌సీ) వద్ద మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆకుకూరలు, కూరగాయల మొక్కల విత్తనాల ప్యాకెట్లను మంగళవారం పంపిణీ చేశారు. పాఠశాలల ఆవరణల్లోని ఖాళీ ప్రదేశాల్లో కూరగాయలు, ఆకుకూరలు పెంచి, వాటిని విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం వంటకాల్లో వినియోగించాలని తెలిపారు.

గడువులోగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి

- పది రోజుల్లో లబ్ధిదారులకు బిల్లులు
- స్పెషల్ ఆఫీసర్ ఎం.వి.కరుణాకర్




మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ ఎంవీ కరుణాకర్

సీతానగరం: మండలంలోని ఇళ్ల లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయడానికి మండలస్థాయి అధికారులు చర్యలు చేపట్టాలని స్పెషల్ ఆఫీసర్ (డీఐసీ జిల్లా మేనేజర్) ఎంవీ కరుణాకర్ అన్నారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సబ్‌డివిజనల్, మండల స్థాయి అధికారులతో ఇళ్ల నిర్మాణాల నిమిత్తం గృహనిర్మాణ శాఖ డీఈ సోమేశ్వరరావు, ఏఈ జానకీరాం అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ కరుణాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల లబ్ధిదారులకు గృహాలు మంజూరు చేసినప్పటికీ వివిధ కారణాల వల్ల అర్థాంతరంగా నిర్మాణాలు ఆగిపోయినట్లు గుర్తించిన వారందరి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడానికి అవకాశం కల్పించిందన్నారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులకు తెలియ జేయడానికి, పనులు త్వరితగతిన పూర్తి చేయడానికి మండలస్థాయి అధికారులను ప్రభుత్వం నియమించిందని, వారంతా గ్రామాల్లో పర్యటించి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడానికి కృషి చేయనున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం హయాంలో మంజూరు చేసిన జగనన్న కాలనీల్లో అసంపూర్తిగా ఉండిపోయిన ఇళ్లనిర్మాణాలు పూర్తి చేసిన పది రోజుల్లో లబ్ధిదారుల ఖాతాలకు బిల్లులు జమ చేయనున్నట్లు స్పష్టం చేశారు. పీఆర్‌ఈఈ ఎం.రత్నకుమార్ మాట్లాడుతూ కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసిన వెంటనే మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వం గృహలబ్ధి దారులకు కల్పించిన అవకాశాల్ని వినియోగించు కోవాలని కోరారు. తహసీల్దార్ జె.రాములమ్మ మాట్లాడుతూ గ్రామాల్లో ఇళ్లనిర్మాణాలు ఏ స్థాయిల్లో ఉన్నాయో ఆరా తీశామని, గ్రామసభలు నిర్వహించి నిర్మాణాలు పూర్తి చేయడానికి తమవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ ఇంజనీరింగ్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సహాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ, విద్యారంగసమస్యల పరిష్కారమే లక్ష్యం

- యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మురళీమోహన రావు



మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ మురళీమోహన్

సీతానగరం: జిల్లాలో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా యూటీఎఫ్ పని చేస్తుందని పార్వతీపురం మన్యం జిల్లా యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి సుర్ల మురళీమోహనరావు అన్నారు. ఈ మేరకు గాదెలవలస ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూటీఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జరుగుతున్న స్వర్ణోత్సవాల్లో ప్రతి సభ్యుడూ భాగస్వామి కావాలని, సంఘం బలోపేతానికి చేయూత నివ్వాలని కోరారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటం చేయడానికి యూటీఎఫ్ కృషి చేస్తుందని చెప్పారు. అలాగే మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలలను సందర్శించి సభ్యత్వం నమోదు కార్యక్రమం పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు, మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు పి.శ్రీనివాసరావు, బి.ప్రసాదరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు సహచర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పార్వతీపురం / సాలూరు
9010204441, 9951602891
Office mail : vzmadvt@gmail.com